క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న గుడివాడ అమర్‌నాథ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

వైభవంగా గుండాలమ్మ తీర్థం



గుండాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

పరవాడ: పరవాడ గ్రామంలో రెడ్డి వారి గుండాలమ్మ తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, భజనలు, చిడతలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పెద్ద చెరువు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, రెడ్డి నాయుడు, రెడ్డి ఎర్రినాయుడు, నాగేష్, వెంకినాయుడు, రెడ్డి శ్రీను, రెడ్డి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యులు



ప్రసంగిస్తున్న ప్రధానార్చకుడు శేషాచార్యులు

సీతంపేట: ప్రపంచ సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యుల జీవితమే ఒక గొప్ప సందేశమని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు గోపినంబాళ్ల శేషాచార్యులు పేర్కొన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శ్రీమద్రామానుజాచార్యుల విశిష్టతపై ఆయన ప్రసంగించారు. 1017–1137 మధ్య కాలంలో జీవించిన శ్రీమద్రామాజానుచార్యులు విశిష్ట ద్వైతాన్ని ప్రతిపాదించిన గొప్ప తత్వవేత్త, హేతువాది, యోగి అని కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ సర్వమత సారం ఒక్కటేనని బోధించి, దాన్ని ఆచరించి ప్రజలకు వివరించిన సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యులు నేటి తరానికి ఆదర్శప్రాయులన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త రాంభట్ల నృశింహశర్మ, దయాల్ సుబ్రహ్మణ్యం, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాఘ ఆదివారం పూజలు



సింహాచలం: మాఘ మాసం తొలి ఆదివారం పురస్కరించుకుని 95వ వార్డు పరిధి సుజాతానగర్‌లోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో సూర్యదేవుడికి విశేషంగా పూజలు నిర్వహించారు. స్వామికి తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి ని విశేషంగా అలంకరించి భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం



దుడ్డువాకలో మహిళకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



బుదిరెడ్లపాలెం జంక్షన్ వద్ద ఫిష్ ఆంధ్ర మినీ వెండింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: అర్హత ఉంటే పార్టీలతో సంబంధం లేకుండా ప్రభుత్వం సంక్షేమ ఫలాలు వలంటీర్ల ద్వారా మీ ముంగిటకే చేరవేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు.మండలంలోని బోదువలస సచివాలయం పరిధిలోని అయ్యన్నపాలెం,బుదిరెడ్లపాలెం,రాపర్తివానిపాలెం,కిల్లివానిపాలెం,దుడ్డువాక గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని గణంకాలతో వివరించారు. గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. దుడ్డువాకలో తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జేజేఎం నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా అయ్యన్నపాలెం ఎస్సీ కాలనీలో మురుగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

అయ్యన్నపాలెం పంచాయతీలో ఎమ్మెల్యే చేతులమీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. వీటితో పాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కూడా టీడీపీ మద్దతుదారు అయిన అయ్యన్నపాలెం సర్పంచ్,ఉప సర్పంచ్‌లు బుదిరెడ్ల శ్రీలక్ష్మి, బుదిరెడ్ల కనకారావు ఉత్సాహంగా పాల్గొన్నారు. అయ్యన్నపాలెంలో నాడు–నేడు పథకంలో భాగంగా రూ.18.90 లక్షలతో ఆధునికీకరించిన ఎంపీయూపీ పాఠశాలను ప్రారంభించారు. గుల్లేపల్లి–కోటపాడు రోడ్డులో బుదిరెడ్లపాలెం జంక్షన్ వద్ద ప్రభుత్వ రాయితీతో ఏర్పాటు చేసిన శీరంశెట్టి దేవీకి చెందిన ఫిష్ ఆంధ్ర మినీ వెండింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అయ్యన్నపాలెంలో రూ.6.8లక్షలు,బుదిరెడ్లపాలెంలో రూ.15.3 లక్షల,కిల్లివానిపాలెంలో రూ.6.5 లక్షల,దుడ్డువాకలో రూ.6.2 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వెల్లడించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, స్థానిక నాయకులు బుదిరెడ్ల రామకృష్ణ,దాసరి రామకృష్ణ,దొగ్గ దేముడు,దొగ్గ చిన్నారావు,ఉగ్గిన నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమర్‌నాథ్ పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సింహాచలం: రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పుట్టినరోజు వేడుకలుల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కేక్ కట్ సి పార్టీ నాయకులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, మార్కెటింగ్ కమిటీచైర్మన్ కె.దేవిసాంబ, నాయకులు గొర్లె రామునాయుడు, ఉప్పిలి కనకరాజు, పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని లారీ డ్రైవర్ ఆత్మహత్య!

అనుమానాస్పద మృతిగా కేసునమోదు



శ్రీనివాసరాజు (ఫైల్)

పరవాడ: దేశపాత్రునిపాలెంలో నివసిస్తున్న లారీ డ్రైవర్ దెందుకూరి శ్రీనివాసరాజు (40) సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అందించిన వివరాలు...అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరాజు భార్య ఇద్దరు పిల్లలు, తల్లి అప్పలనర్సమ్మతో కలిసి దేశపాత్రునిపాలెంలో కొంత కాలం నుంచి నివాసం ఉంటున్నాడు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న శ్రీనివాసరాజు భార్యా పిల్లలతో శనివారం ఉదయం యారాడ బీచ్‌కు వెళ్లి సాయంత్రం 5.30 గంటలకు తిరిగి వచ్చారు. అనంతరం పనిచేస్తున్న ట్రాన్స్‌పోర్టు ఆఫీసుకు వెళ్లి రాత్రి ఇంటికి చేరుకున్నాడు. భోజనం చేసిన అనంతరం తన బెడ్ రూంలో పడుకోవడానికి వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో శ్రీనివాసరాజు కుమారుడు తండ్రి పడుకొన్న గది తలుపుకొట్టాడు. లోపలి నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తెరచిచూడగా బెడ్‌షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరిపోసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దింపి గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోకి కేజీహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు శ్రీనివాసరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరాజుకు అతని భార్యకు కొంత కాలం నుంచి మనస్పర్థలు ఉన్నాయని మృతుడు తల్లి అప్పలనర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

శ్యామానవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దేవీపురంలో గోపూజతో శ్యామా నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న రాజశ్యామలాదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో శ్యామానవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో తొలుత గోపూజ నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీమేరు ఎదురుగా ఉన్న హోమశాలలో సాయంత్రం శ్రీగణపతి సహిత రాజశ్యామలా హోమం నిర్వహించారు.గోపూజ అనంతరం గణపతి,శ్యామాదేవి,అంగ,ఉపాంగ,ప్రత్యాంగ దేవతలకు కలశస్థాపన చేశారు.ఉత్సవమూర్తి రాజశ్యామల దేవికి భక్తులచే క్షీరాభిషేకం, షోడషోపచార పూజ,అష్టోత్తర పూజలు నిర్వహించారు. గురుమాత అన్నపూర్ణమ్మ చేతులుమీదుగా భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. తొమ్మిది రోజుల పాటు శ్రీవిద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని గురుమాత తెలిపారు.

సేవాగుణం అవసరం



భరతమాత పూజలో పాల్గొన్న భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావాడ రామాలయం వద్ద ఆదివారం భరతమాత పూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పరవాడ సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు మాట్లాడుతూ భరతమాత మనందరికీ తల్లిలాంటిదన్నారు. అలాంటి తల్లి నుంచి ఎందరో అవతార పురుషులు, వేదాలు, పురణాలు వంటివి ఉద్భవించాయన్నారు. భారతదేశంలో ప్రతీ ఒక్కరు మాతృభూమి కోసం తమ వంతు సహకారం అందించాలన్నారు. సంస్కృతి, సంప్రాదాయలకు భారత దేశం నిలయమని పేర్కొన్నారు. దేశం, ధర్మం, సమాజ మంచి కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అప్పలనాయుడు హితవు పలికారు. కార్యక్రమంలో దాసరి వెంకటరమణ, సాలాపు వెంకటరమణ, మరిశ రామారావు, సత్తిబాబు, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు సంకల్పంతో ప్రజాగర్జన



గంగవరంలో పాదయాత్ర చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 30న ఉక్కునగరం తృష్ణా మైదానంలో నిర్వహించనున్న ఉక్కు ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. గర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఉదయం గంగవరంలో, సాయంత్రం నడుపూరు రామాలయం నుంచి మహా పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఎంతోమంది ఇళ్లు, భూములు ఇచ్చారని, వారి త్యాగాలను వృథా కానీయమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఉక్కు సంకల్పంతో చేపట్టిన ప్రజా గర్జనకు నిర్వాసితులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మి కులు, కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. 710 రోజులుగా ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. అనంతరం విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, అఖిల పక్ష యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

భీమ్‌సేన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ అర్జున్, భీమ్‌సేన ప్రతినిధులు

సీతంపేట: భీమ్‌సేన వైజాగ్–2023 క్యాలెండర్‌ను ఆదివారం అంబేడ్కర్ భవన్ వద్ద ముఖ్య అతిథి ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ అర్జున్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ భీమ్‌సేన భరోసా ఇస్తోందన్నారు. భీమ్‌సేన వ్యవస్థాపకుడు రవిసిద్ధార్థ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ నిర్దేశించిన బోధించు, సమీకరించు, పోరాడు లక్ష్యాలకు అనుగుణంగా భీమ్‌సేన 8 ఏళ్లుగా పనిచేస్తోందని తెలిపారు. ఈ ఏడాది కూడా బాబాసాహెబ్ ఆశించిన లక్ష్యాలను చేరే విధంగా పనిచేస్తామన్నారు. భీమ్‌సేన అధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలంతో ఉన్న యువత భీమ్‌సేనలో చేరి సంస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భీమ్‌సేన భీమిలి నియోజకవర్గ అధ్యక్షుడు దినకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి లలితా పీఠంలో 74వ బ్రహ్మోత్సవాలు

సీతంపేట: కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి 87వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 5 వరకు విశేష పూజా కార్యక్రమాలు, చతుర్ద శాహ్నిక అష్టముఖ గండ భేరుండ జ్వాలా నారసింహ సుదర్శన మహాయాగం నిర్వహించనున్నట్టు పీఠం సీఈవో మోచర్ల శశిభూషణ్ తెలిపారు. సంబంధిత కరపత్రాలను ఆదివారం లలితా పీఠం దర్బారు హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ మాట్లాడుతూ స్వామి జన్మదినోత్సవం సందర్భంగా లోక కల్యాణార్థం, ధర్మ రక్షణార్థం విశేష పూజలు, లలితా పీఠం 74వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 23వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు లలితా పీఠంలో జరగనున్న స్వామివారి జన్మదినోత్సవ సభలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి పాల్గొంటారని చెప్పారు. 26న వసంత పంచమి సందర్భంగా లలితా అమ్మవారికి సరస్వతి అలంకారం, సరస్వతి హోమం, విద్యార్థులకు ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం లలితాకామేశ్వరుల కల్యాణం, 4వ తేదీ సాయంత్రం లలితా అమ్మవారి గ్రామోత్సవం, 5వ తేదీ ఉదయం కాళీకాలభైరవ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఈ నెల 24 నుంచి 30 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే భాగవత సప్తాహప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. సమావేశంలో సిద్ధేశ్వరీ పీఠం అడ్వైజర్ మునికృష్ణ, లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న స్థానాచార్యులు, అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశేషంగా గరుడసేవ

వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంచేయజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

వైభవంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరిస్తే చేటు



శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత రామారావు

పరవాడ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిలిపివేస్తూ నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ నేత ఎస్.రామారావు డిమాండ్ చేశారు. 79 వార్డు దేశపాత్రునిపాలెంలో అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షా శిబిరంలో అఖిల పక్ష నాయకులు ఎస్.రామారావు, పి.గంగారం, ఆర్.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, బి.వెంకటరావు, రామ్మోహన్‌కుమార్, గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థ ఉక్కు కర్మాగారాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తే సహించబోమని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తుందని విమర్శించారు. ఉక్కునగరంలో ఈ నెల 30న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. శిబిరంలో పి.మాణిక్యం, పి.డి.నాయుడు, శివ, రాధాకృష్ణ, భాస్కరరావు, పరమేశ్వరి, రామారావు, రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష



పెందుర్తి ప్రభుత్వ పాఠశాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సింహాచలం: పోలీస్ కానిస్టేబుల్ నియామకాలకు సంబంధించి ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష పెందుర్తి మండలంలోని పది సెంటర్లలో ప్రశాంతంగా జరిగింది. సుజాతనగర్‌లోని నవోద య జూనియర్ కలాశాల, పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్, ఆదర్శ్ డిగ్రీకళాశాల, పులగానివానిపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, పెందుర్తిలోని బాలాజీ డిగ్రీ కళాశాల, శ్రీనారాయణ నారాయణ జూనియర్ కళాశాల, పినగాడిలోని వెల్ఫేర్ కళాశాల, నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, నరవలోని బెహరా పాలిటెక్నిక్, నరవలోని బెహరా శుభాకర్ పాలిటెక్నిక్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. ఆయా సెంటర్లలో మొత్తం 5474మంది పరీక్షకి హాజరు కావాల్సి ఉండగా 4984 మంది హాజరైనట్టు పెందుర్తి లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు తెలిపారు.

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక



గణేష్‌యువజన సేవా సంఘం అధ్యక్షుడు శ్రీనుబాబుతో సంఘం పాత, కొత్త సభ్యులు

సింహాచలం: అడవివరంలోని గణేష్ యువజన సేవా సంఘం సభ్యుల ఆత్మీయ కలయిక ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 39 ఏళ్ల కిందట ఏర్పడిన గణేష్ యువజన సేవా సంఘానికి చెందిన సభ్యులంతా స్థానిక భైరవవాక సమీపంలోని తోటలో కలిశారు. తమ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ 39 ఏళ్ల కిందట ఏర్పడిన గణేష్‌యువజన సేవా సంఘం ఆయిల్ మిల్ వద్ద ఏటా వినాయక చవితి, దేవినవరాత్రులు వైభవంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. పార్టీలకతీతంగా అంతా కలిసిమెలసి ఉండాలని, మిత్రుల కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు నాగు, అక్కిరెడ్డి అప్పలరాజు, గంట్ల కిరణ్‌బాబు, కొల్లి చిన్న, సిడగం రాము, గంగ్రెడ్డి ఈశ్వరరావు, ప్రతాప్, ములకలపల్లి రాజు, నాని, జగదీష్, కొల్లి శంకర్, మారుతిశ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శశాంక్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్, అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అపోలో ఆస్పత్రి హృద్రోగ వైద్య నిపుణుడు డాక్టర్ శశాంక్ చుండూరి, జనరల్ మెడిసిన్ డాక్టర్ వి.ప్రణీత 110 మంది స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్ వైద్య పరీక్షలతోపాటు ఈసీజీ నిర్వహించి రిపోర్టులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ రోజూ వ్యాయామం చేయడం, నడవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. బీపీ, సుగర్ ఉన్న వారు తప్పనిసరిగా ఆహార నియమాలు పాటించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ సలహాలు లేకుండా మందులు వాడరాదని చెప్పారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్, పూర్వాధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామ్, బి.సూర్యనారాయణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

డాబాపై నుంచి పడి వ్యక్తి మృతి

మల్కాపురం: మద్యం తాగి ఉన్న ఓ వ్యక్తి రెండంతస్తుల డాబా పైనుంచి జారి పడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. 58వ వార్డు శ్రీహరిపురం పాత రామాలయం వీధిలో తిట్టి శ్రీను(35) అనే వ్యక్తి తన భార్య, పిల్లలతో కలిసి కొన్నేళ్లగా నివాసముంటున్నాడు. ఓ ప్రైవేట్ సంస్థలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఫుల్‌గా మద్యం తాగి ఉన్న శ్రీను తను ఉంటున్న రెండు అంతస్తుల డాబాపై నుంచి కిందకు తొంగి చూసేసరికి అదుపుతప్పి పడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే శ్రీను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించడంతో జరిగిన సంఘటనపై మృతుడి భార్య మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి సీఐ లూథర్‌బాబు, సిబ్బంది వెళ్లి విచారించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.